
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



కంది ధరపై రైతుల రంధి

కంది పంటకు సరైన మద్దతు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. మూడు నెలల క్రితం క్వింటా రూ.9 వేలు ఉన్న ధర తీరా పంట చేతికి వచ్చాక రూ.6,500కు పడిపోయింది. - IIలో..



జల్సాల కోసం బైకుల చోరీ


జల్సాలకు అలవాటు పడి మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
33/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

కంటైనర్ల మాటున
కాసుల వేట



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు టీడీపీ నేతలు ఏ చిన్న అవకాశం దొరికినా వదలకుండా కాసుల వేట సాగిస్తున్నారు. పోలీసుల అండదండలూ తోడవడంతో పచ్చ నేతల ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఇతర దేశాలకు ఎగుమతయ్యే గ్రానైట్ కంటైనర్ల రవాణా చార్జీలు పెంచి ఆ మొత్తాన్ని తమ జేబుల్లో వేసుకోవడానికి పథకం రచించారు. అనుకున్నదే తడవుగా సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యే పీఏ సూచనలతో ఆయన అనుచరుడు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే చెన్నై ట్రాన్స్‌పోర్టు యజమానులతో రహస్య పంచాయితీ సాగించడం వారి ధనదాహానికి నిదర్శనంగా నిలుస్తోంది.

- గ్రానైట్ కంటైనర్ల రవాణాపై ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే అనుచరుడి కన్ను
- ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ, పోలీసు అధికారి సహకారంతో ట్రాన్స్‌పోర్టర్లకు బెదిరింపులు
- చెన్నై ట్రాన్స్‌పోర్ట్ యజమానులతో స్టేషన్‌లో రహస్య పంచాయితీ
- కంటైనర్ రవాణా చార్జీలు పెంచాలని పచ్చనేత, పోలీసుల బెదిరింపులు
- రూ.35 నుంచి రూ.40 వేలు ఉన్న రవాణా చార్జీలను రూ.50 వేలకు పెంచాలని హుకుం
- ఆ పెంచిన సొమ్ము నెలకు రూ.1.5 కోట్ల వరకు స్వాహా చేసేందుకు స్కెచ్
- చెన్నై పోర్టుకు నెలకు జిల్లా నుంచి సుమారు వెయ్యి కంటైనర్లలో రవాణా

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అధికార టీడీపీ ముఖ్య నేతలతో పాటు వారి అనుచరులు ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. పోలీసుల అండతో కొత్త ఆదాయ మార్గాలకు శ్రీకారం చుడుతున్నారు. చివరికి వారి పోకడలు వ్యవస్థలను సైతం నిర్వీర్యం చేసి అంతర్ రాష్ట్ర సమస్యలు సృష్టించేలా ఉన్నాయి. దీనిలో భాగంగానే ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే గ్రానైట్ కంటైనర్ల రవాణాపై ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే అనుచరుడి కన్ను పడింది. ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏతో చర్చించి పోలీసు అధికారుల సహకారంతో కంటైనర్ల రవాణా చార్జీలను పెంచి ఆ మొత్తాన్ని కొల్లగొట్టేలా పథకం రచించారు. వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసు అధికారిని కలిసి కంటైనర్ ట్రాన్స్‌పోర్ట్ యజమానులను పిలిచి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను పెంచేలా చూడాలని ఎమ్మెల్యే పేరును ఉపయోగించి అడిగినట్లు సమాచారం. వెంటనే సదరు అధికారి పోలీసు స్టేషన్‌లోని మహిళా పోలీసులతో చెన్నైలోని ట్రాన్స్‌పోర్ట్ యజమానులకు పదే పదే ఫోన్‌లు చేసి బుధవారం ఒంగోలు పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. సుమారుగా 20 మంది చెన్నై ట్రాన్స్‌పోర్ట్ యజమానులు వచ్చినట్లు సమాచారం.

స్టేషన్‌కు వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ యజమానుల వ్యక్తిగత వివరాలను రాసి ఇవ్వాలని సదరు పోలీసు అధికారి ఆదేశించారు. వారు అందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. అయితే పోలీసు అధికారి మాత్రం వివరాలు తర్వాత ఇవ్వండి ముందుగా మాట్లాడదాం అని చెప్పి ఎమ్మెల్యే అనుచరుడితో మాట్లాడుకుని సర్దుబాటు చేసుకోవాలని, లేకుంటే కంటైనర్‌లను ఏ మాత్రం తేడా ఉన్నా సంతనూతలపాడు-ఒంగోలు బార్డర్‌లో నిలుపుదల చేస్తామని, సర్దుబాటు చేసుకుంటే రవాణాకు ఎటువంటి ఇబ్బంది ఉండదంటూ రహస్య పంచాయితీ చేసినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెంచేందుకు ఇప్పటికే మరో ట్రాఫిక్ సీఐ ఒకరు కంటైనర్‌లను పరిశీలించాలని..అన్నీ సక్రమంగా ఉన్నా రెండు మూడు రోజుల పాటు నిలుపుదల చేశారు. దీనివల్ల వెజిల్ (కంటైనర్‌లు ఎగుమతి చేసే పడవ) సమయం అయిపోతుందని, దీంతో వెజిల్ చార్జీలు మరింత పెంచి చెల్లించాల్సి వస్తుందని ట్రాన్స్‌పోర్ట్ యజమానులు అంటున్నారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెంచేందుకు ఈ విధంగా ఇబ్బందులు పెడుతున్నారని, ఇప్పుడు నేరుగా స్టేషన్‌లోనే పంచాయితీ షురూ చేశారని చెన్నై ట్రాన్స్‌పోర్టర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కృష్ణపట్నం పోర్టుకు తరలించే సమయంలోను ఇదే పరిస్థితి రావడంతో ట్రాన్స్‌పోర్ట్ యజమానులు పెరిగిన కిరాయితో చూస్తే చెన్నై పోర్టుకు తరలించడమే తేలికగా భావించి గ్రానైట్‌ను చెన్నై పోర్టుకు తరలిస్తున్నారు.

ఇతర దేశాలకు ఎగుమతులు ఇలా..

ఇతర దేశాలకు గ్రానైట్ ఎగుమతి చేసే విధానంలో ముందుగా ఇతర దేశాల్లో గ్రానైట్ ఆర్డర్‌లను బుక్ చేసుకున్న బయ్యర్‌లు ఇక్కడ ఉన్న మార్కర్‌లకు ఆర్డర్ మేరకు ఎంత గ్రానైట్ ఏ సైజ్‌లో అవసరమో తెలిపి కొనుగోలు చేస్తారు. ఇక్కడి నుంచి గ్రానైట్ ఆయా దేశాలకు తరలించేందుకు ముందుగా షిప్పింగ్ ఏజెన్సీలతో మాట్లాడి వెజిల్‌ను నిర్ధారించుకుంటారు. ఆ వెజిల్‌లో ఎన్ని కంటైనర్‌లకు చోటు ఉంది. ఏ తేదీకి వెజిల్ చెన్నై పోర్టుకు వస్తుంది, ఎన్ని రోజులు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను షిప్పింగ్ ఏజెన్సీ వాళ్లు కంటైనర్ ట్రాన్స్‌పోర్ట్ వారికి తెలియచేస్తారు. వెజిల్ సదుపాయాన్ని బట్టి గ్రానైట్ లోడ్‌ను కంటైనర్‌లలో పోర్టుకు తరలిస్తారు.

నెలకు రూ.1.5 కోట్ల వరకు దోపిడీకి స్కెచ్

ఒక కంటైనర్ మన జిల్లా నుంచి చెన్నై పోర్టుకు తరలించేందుకు రూ.35 నుంచి రూ.40 వేల వరకు చార్జీ చేస్తారు. అయితే ఇక్కడే టీడీపీ నేతలు, పోలీసులు రవాణా చార్జీని రూ.50 వేలకు పెంచి పెరిగిన రూ.10 వేలను తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు పంచుకునేలా పథకం రచించారు. జిల్లా నుంచి నెలకు సుమారు వెయ్యి కంటైనర్లకు పైగానే చెన్నై పోర్టుకు వెళతాయని ట్రాన్స్‌పోర్టర్లు అంటున్నారు. దీన్నిబట్టి పెరిగిన రూ.10 వేల లెక్కన దాదాపు నెలకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోటి వరకు కొల్లగొట్టేందుకు పచ్చనేతలు, పోలీసులు స్కెచ్ వేశారు. ఇంత పెద్ద స్కెచ్ ఎమ్మెల్యేలకు, ఎస్పీకి తెలియకుండానే జరుగుతుందా, ఇంత ధైర్యంగా ఎమ్మెల్యే అనుచరులు, పోలీసులు చేయగలరా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారం ఎవరిపైన...

ఒక వేళ రూ.10 వేలు అదనంగా రవాణా చార్జీలు పెరిగితే వేలాది కంటైనర్ల సరఫరాకు సంబంధించి పెరిగిన కోట్లాది రూపాయల భారం ఎవరిపై పడుతుందనే పెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఉత్పత్తిదారులకు రేటు తగ్గిస్తారా లేక కొనుగోనుదారుల వద్ద రేట్లను పెంచుతారా అనేది సందిగ్ధం. ఇదే జరిగితే వ్యవస్థలు నాశనమవుతాయి. ఇప్పటికే గ్రానైట్ వ్యాపారం బాగా పడిపోయింది. వందలాది ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇటువంటి ఘటనలు జరిగితే గ్రానైట్ రంగం కుదేలవుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ఎగుమతులపైనా ప్రభావం:

ఒక వేళ చెన్నై ట్రాన్స్‌పోర్టర్‌లు కిరాయిలు పెంచమని తేలిస్తే వారి వాహనాలకు అడ్డుకట్ట వేస్తారేమో అనే భయం వారిలో వెంటాడుతోంది. మరో పక్క వివాదం పెద్దదైతే మన జిల్లా నుంచి ఎగుమతుల కోసం చెన్నై పోర్టుకు వెళ్లే అన్నీ కంటైనర్‌లకు ఇబ్బందులు తప్పవని జిల్లా వ్యాపారులు భయపడుతున్నారు. ఇదే వివాదం ముదిరితే మన జిల్లా నుంచి ఎగుమతులయ్యే గ్రానైట్‌తో పాటు రొయ్యలు, పొగాకు, మిర్చి వంటి వాటి ఎగుమతులకు చెన్నైలో అంతరాయం ఏర్పడితే పరిస్థితి ఏంటనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చిలికి చిలికి గాలి వానలా మారి అంతర్ రాష్ట్ర సమస్యగా తలెత్తకముందే కలెక్టర్, ఎస్పీలు సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గ్రానైట్ కంటైనర్ రవాణాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు. అంతే కాకుండా గ్రానైట్ ఎగుమతికి సంబంధించి పంపే కంటైనర్‌లు మన జిల్లా నుంచి కేవలం 70 నుంచి 80 మాత్రమే ఉండగా చెన్నై ట్రాన్స్‌పోర్టర్స్ నుంచి 700 కంటైనర్‌లు ఉన్నాయి. అటువంటి వారిపై కిరాయిలు పెంచమని ఒత్తిడి తేవడం, ఒప్పుకోకుంటే అన్నీ పేపర్లు ఉన్నా వెజిల్ సమయం దాటే వరకు కంటైనర్‌లను పరిశీలన పేరుతో నిలుపుదల చేయడం అన్యాయమని ట్రాన్స్‌పోర్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షిప్పింగ్ ఏజెన్సీలు, ట్రాన్స్‌పోర్టర్స్, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే సంబంధం ఉన్న ఈ అంశంలో రాజకీయ ఒత్తిళ్లు తీసుకు రావడం సరికాదని వాపోతున్నారు.



పోలీసు స్టేషన్ వద్ద హాజరైన చెన్నై కంటైనర్ యజమానులు

న్యూస్‌రీల్

పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియ సజావుగా చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియ సజావుగా చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా విద్యా శాఖ అధికారులకు సూచించారు. పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గాల వారీగా మండల విద్యా శాఖ అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో సమీక్షించారు. వారు తయారు చేసిన పీపీటీలను పరిశీలించి తగు మార్పులను తెలిపారు. అనంతరం జిల్లాలో 38 పాఠశాల పునః నిర్మాణ ప్రక్రియకు ఆమోదం తెలిపారు. దీనిలో డీఈఓ కిరణ్‌కుమార్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఉప విద్యా శాఖ అధికారులు, డీసీఈబీ సెక్రటరీలు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



రైస్ మిల్లులో నిల్వలు పరిశీలిస్తున్న జేసీ

పొదిలి: స్థానిక ఒంగోలు రోడ్డులోని లక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లును జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలను, రికార్డులను పరిశీలించారు. యజమానులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. అనంతరం కాటూరివారిపాలెంలో రేషన్ దుకాణం 34ను కూడా తనిఖీ చేశారు. స్టాకు, రికార్డులను పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ ఎంవీ.కృష్ణారెడ్డి, ఆర్ఐ, వీఆర్‌ఓలు ఉన్నారు.

సదరమ్ క్యాంపును పరిశీలించిన డీఎంహెచ్ఓ



సదరమ్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో జరుగుతున్న సదరమ్ క్యాంపును డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబులు గురువారం పరిశీలించారు. క్యాంపులో సైక్రియాట్రి, ఎముకలు, కీళ్ల విభాగాల్లో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి త్వరగా వైద్య పరీక్షలు చేసి వారి స్వగ్రామాలకు వెళ్లేలా చూడాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరించకుండా మానవత్వంతో మసులుకోవాలని సిబ్బందికి సూచించారు. దీనిలో ఆర్ఎంఓ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు మాధవీలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లకు క్రీడా సామగ్రి సరఫరా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు క్రీడా సామగ్రిని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరక్టర్ ఎస్ లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 7 సహాయ సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాల పరిధిలో 75 వసతి గృహాలకు ఈ క్రీడా సామగ్రిని సరఫరా చేశారు. ఇక్కడ నుంచి వసతి గృహాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్నారు. టెన్నికాయిట్, చెస్‌బోర్డ్స్, కారమ్ బోర్డ్స్, షటిల్ కాక్, షటిల్ బ్యాట్, షటిల్ నెట్, స్కిప్పింగ్ రోప్, వాలీబాల్, వాలీబాల్ నెట్, డిస్కస్ త్రో, పీవీసీ విత్ రింగ్, జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లను పంపిణీ చేశారు.

నేటి నుంచి జర్దోసి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: జర్దోసి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరక్టర్ పీ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 30 రోజుల పాటూ ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత, భోజన వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర పూర్తి వివరాలకు 8309915577 అనే నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బూచేపల్లి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ వ్యవహారాలపై చర్చించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ హోదాల్లో ప్రకాశం జిల్లా పార్టీ కమిటీ నాయకులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా ఉపాధ్యక్షులుగా చుంచు రామకృష్ణ, గుంటక తిరుపతిరెడ్డి, ఢాకా పిచ్చిరెడ్డి, కొత్తమారం వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, వెన్నా భాస్కరరెడ్డి, గుమ్మా రాజేంద్రప్రసాద్, ఇనగంటి పిచ్చిరెడ్డి లను నియమించారు. అలాగే జనరల్ సెక్రటరీలుగా మన్నెం శ్రీధర్‌బాబు, సుడి దేవర అంజయ్య, కొప్పర్తి చిన్నఓబుల్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య, ముత్యాల నారాయణరెడ్డి, కోశాధికారిగా ఎదురు కోటిరెడ్డి లను నియమించారు. ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, కుంచాల బ్రహ్మయ్య, నాగదాసరి తిరుపతిరాజు, వరికుంట్ల పెద్ద కోటేశ్వరరావు, దాసరి కరుణాకర్, కమ్మ సురేష్‌బాబు, రాయపాటి అంకయ్య, ఇత్తడి దేవదానం, కొరివి మునలయ్య యాదవ్, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కుమ్మారి సుధాకర్, కొండ్రు నరసింహారావు, బత్తుల అంజయ్య, కొర్లకుంట జానకీరఘు, గొలమరి బాలకోటిరెడ్డి, జనుముల జాన్‌రత్నం, చిరుగూరి కోటేశ్వరరావులను నియమించారు. సెక్రటరీ యాక్టివిటీలుగా కె.మాధవరావు, కట్టా ఆనందరావు, మారం ఇంద్రసేనారెడ్డి, బత్తుల సుబ్బయ్య, బోయపాటి రామకృష్ణ, బండెల ఏసుదాసు, గొడ్డపాకల రవి, కె.మాలకొండయ్య, గాయకవాడ సుభాషిణి, శ్రీరామ సతీష్, సయ్యద్ అఫ్సార్, సింగా ప్రసాద్, దొమకాలు వెంకటేశ్వర్లు, నాగం ప్రసాద్, సూరెడ్డి వెంకటనారాయణరెడ్డి లను నియమించారు. అధికార ప్రతినిధులుగా బెజవాడ శ్రీరామమూర్తి, జి.లింగారెడ్డి, నరాల రమణారెడ్డి, బైలా దేవదాసు, గండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఏలూరి నారాయణరెడ్డి, మెట్టు వెంకటరెడ్డి లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

టీడీపీ నేత చుట్టూ సంధ్య హత్య కేసు!

- కనిగిరి టీడీపీ మాజీ సర్పంచ్ కోసం పోలీసుల గాలింపు
- పోలీసులకు దొరకాల్సింది.. సూత్రధారా..? పాత్రధారా..?

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అదో సినీ ఫక్కీలో జరిగిన ప్రీ ప్లాన్డ్ హత్య. పొదిలి సమీపంలో గత ఏడాది జరిగిన ఈ ఘటనపై తొలుత రోడ్డు ప్రమాదంగా గతేడాది ఫిబ్రవరి 24న కేసు నమోదైంది. పోలీసుల విచారణలో అది కారు ప్రమాద మరణం కాదు.. హత్య అని నిర్ధారించారు. కూలిపని చేసుకుని జీవించే చెల్లి మాలపాటి సంధ్య పేరుతో ముందుగానే సుమారు రూ.1.30 కోట్ల ఇన్సూరెన్స్ చేసి ఆపై ఆ నగదు కాజేసేందుకు మరి కొందరితో కలిసి సొంత అన్న మాలపాటి అశోక్‌రెడ్డే హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈమేరకు ఆ హత్య కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న కనిగిరి మండలం పునుగోడుకు చెందిన అశోక్‌రెడ్డిని పోలీసులు గత నెలలో అరెస్ట్ చేశారు. ఈమేరకు మరికొంత మంది ఈ హత్యలో పాలుపంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. దాన్ని బలపరుస్తూ హతురాలు సంధ్య తల్లి కనిగిరికి చెందిన ముగ్గురిపై ఆరోపణలు చేసింది.

వారి వల్లే తన కుమారుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఆరోపించింది. ఒక ఉద్యోగి పేరుతో పాటు, కనిగిరి మండలానికి చెందిన మరో ఇద్దరు టీడీపీ నేతల (మాజీ సర్పంచ్‌లు) పేర్లను బహిర్గతం చేస్తూ ఆరోపించింది.

టీడీపీ నేత చుట్టూ సంధ్య హత్య కేసు..?

మృతురాలి తల్లి ఆరోపణలతో కనిగిరి మండలానికి చెందిన టీడీపీ నేతల పాత్ర విషయం వెలుగు చూసింది. దీంతో ఈ కేసు ఆద్యంతం కనిగిరికి చెందిన ఓ మాజీ సర్పంచ్ చుట్టూ తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన ముద్దాయి గా ఉండి హత్యోదంతంలో కీలకంగా వ్యవహరించిన హతురాలి అన్న మాలపాటి అశోక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.3.50 లక్షలు నగదు లంచం తీసుకుని ఫోరెన్సిక్ నివేదికలను తారుమారు చేయడంలో సహకరించిన పొదిలి ఆస్పత్రిలోని యూనస్‌ను కూడా రిమాండ్‌కు పంపించారు. అయితే యూనస్‌తో ముద్దాయిలకు లింక్ కలిపిన కనిగిరి మండలంలోని గురువాజీపేట ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో ఆ ఉద్యోగి కొన్ని బలమైన ఆధారాలు పోలీసులకు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ టీడీపీ నేత కోసం గాలింపు..?

ఈ హత్య కేసులో ఇంకా మరి కొందరు నిందితులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలి తల్లి ఆరోపించిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లలో ఒకరి పాత్ర పూర్తి స్థాయిలో ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఆ ఇద్దరిలో ఒకరు పూర్తిగా అండర్ గ్రౌండ్‌కు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అతని కోసం పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. అయితే ఆ టీడీపీ నేత సంధ్య హత్యలో పాత్ర ధారుడా..? సూత్రధారుడా..? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంపై పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజల మన్ననలు పొందుతూ మెరుగైన సేవలు అందించటమే లక్ష్యమని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ అన్నారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళా ఫిర్యాదుదారుల పట్ల పాటించాల్సిన ప్రవర్తన, ఫిర్యాదుల స్వీకరణ, సత్వర పరిష్కారం వంటి అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్ (మహిళా సహాయక కేంద్రం) బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రం వద్ద మహిళా కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ కు వచ్చిన మహిళా ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడుతూ వారిని కూర్చోబెట్టి, మంచినీరు వంటి తగిన సదుపాయాలు కల్పించి వారి సమస్యలను సావధానంగా తెలుసుకోవాలని, వారి ఫిర్యాదులను రిసెప్షన్ రిజిస్టర్ లో నమోదు చేసుకోవాలన్నారు. ఫిర్యాదులపై వారికి రసీదు అందజేయాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులకు తెలియజేయాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలపై వచ్చే ఫిర్యాదులపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదులకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రస్తుత స్టేటస్ తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పలు కేసులో బాధితులకు పరిహారాలు అదేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, టీటీసీ సీఐ షమీముల్లా, కమ్యూనికేషన్స్ సీఐ వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎల్ఆర్‌సీ స్థల ఆక్రమణపై విచారణ

బేస్తవారిపేట: బేస్తవారిపేట దరగ రోడ్డులోని సీఎల్ఆర్‌సీ భవనానికి సంబంధిత స్థలాన్ని అటెండర్ ఆక్రమించాడనే ఫిర్యాదుతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజిలెన్స్ అధికారిణి ఝాన్సీరాణి గురువారం విచారణ నిర్వహించారు. అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన పెరికె రాంబాబు పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్‌కు సీఎల్ఆర్‌సీ స్థలం ఆక్రమణ, అటెండర్‌పై ఫిర్యాదు చేశాడు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారిణి విచారణ చేపట్టారు. సీఎల్ఆర్‌సీ భవనానికి 2009లో 50 సెంట్ల స్థలం కేటాయించారని, ఖాళీ స్థలంలో అటెండర్ రంగస్వామి ఆక్రమణ చేసి బిల్డింగ్ కట్టుకుంటున్నాడని, అటెండర్ కార్యాలయంలో ఉండకుండా సెల్‌షాపు నిర్వహించుకుంటున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. రెవెన్యూ సర్వేయర్‌తో సర్వే చేయించి ఆక్రమణ జరిగిందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని, విచారణ నివేదికను డ్వామా పీడీకి అందజేస్తున్నట్లు చెప్పారు. విచారణలో డ్వామా పీడీకి ఏపీడీ భాస్కరరావు, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న జిల్లా విజిలెన్స్ అధికారిణి

క్లుప్తంగా

స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి


సంఘటన స్థలంలో సుబ్బారావు, రాములు

మద్దిపాడు: స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి–తాళ్లూరు రహదారిపై కొలచనకోట సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కొలచనకోట గ్రామానికి చెందిన మోరబోయిన సుబ్బారావు తన భార్య రాములుతో కలిసి పొలంలో గడ్డి కోసుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్నారు. మద్దిపాడు మండలంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు వెనుక వైపు నుంచి ఢీకొనడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్కి తరలిస్తుండగా మార్గం మధ్యలో రాములు (46) మృతి చెందింది. మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి 4 ఏళ్ల జైలు

మార్కాపురం: రోడ్డు ప్రమాదం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. పెద్దారవీడు మండలం కలనూతలకు గ్రామానికి చెందిన కటికల జీవన్‌కుమార్ 2017 అక్టోబర్ 4న తన టూవీలర్‌పై అతివేగంగా మార్కాపురం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న కర్నూలు జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంటకు చెందిన చాట్ల ఏసుదాసు మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొండపాటి గాంధీరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్, ఏఎస్సై మునాఫ్, సిబ్బంది ఐవీ శ్రీనివాసరావు, కిశోర్‌కుమార్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

కంది ధరపై రైతుల రంధి


మార్కాపురం ప్రాంతంలో కోతకు వచ్చిన కంది పంట

సర్కారు నుంచి సరైన 'మద్దతు' లేదని రైతుల ఆవేదన

- క్వింటా కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550
- మూడు నెలల క్రితం ఓపెన్ మార్కెట్‌లో క్వింటా రూ.9 వేలు
- నాణ్యత, ఇతర కారణాలు చూపి రూ.6 వేలకే అడుగుతున్న దళారులు
- డిసెంబర్‌లో కురిసిన వర్షాలతో పూత రాలి దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదంటున్న రైతులు

మార్కాపురం: వాతావరణం అనుకూలించక, తెగుళ్లు చుట్టుముట్టడంతో మిర్చి, పత్తి నష్టపోయిన రైతులతో కంది పైరు దోబూచులాడుతోంది. ప్రకృతి అనుకూలించిందని తొలుత ఆనందించిన కంది రైతులను డిసెంబర్‌లో కురిసిన వర్షాలు ఆందోళనలోకి నెట్టేశాయి. వర్షాల ధాటికి పూత రాలిపోవడం, అదే సమయంలో మారుకా మచ్చల పురుగు ఆశించడంతో కంది పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే బలం మందులు, పురుగు మందులు వాడి కంది పంటను రైతులు రక్షించుకున్నా.. ధర నేల చూపులు చూస్తుండటంతో పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి కూడా లేదని అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో పశ్చిమ ప్రకాశంలోనే కంది పంట అత్యధికంగా సాగవుతోంది. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని మెట్ట భూముల్లో రైతులు ఏటా కంది పైరు సాగు చేస్తూ వస్తున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం పశ్చిమ ప్రకాశంలో 66,500 ఎకరాలకు పైగా కంది సాగు చేశారు.


పొలంలో కుప్పగా వేసిన కందికట్టెలు

సర్కారు తీరుతో ధర దమాల్!

మార్కెట్‌లో కందులకు డిమాండ్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అదేమీ పట్టించుకోలేదు. ప్రస్తుతం కేజీ కంది పప్పు నాణ్యతను బట్టి రూ.120 నుంచి రూ.180కు పైగా పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు మేలు చేసేలా వ్యవహరించాల్సిన కూటమి ప్రభుత్వం వారిని మరింత కుంగదీసే నిర్ణయం తీసుకుంది. క్వింటా కందులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర 7,550 రూపాయలు ప్రకటించింది. దీంతో కందుల ధర ఒక్కసారిగా పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండటంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు మదనపడుతున్నారు. వాస్తవానికి గత డిసెంబర్‌లో బయట మార్కెట్‌లో క్వింటా కందుల ధర రూ.8,500 నుంచి రూ.9 వేల మధ్య పలికింది. ప్రభుత్వం ఇటీవల కనీస మద్దతు ధర రూ.7,550గా ప్రకటించడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వ్యాపారులు క్వింటా రూ.6 వేల నుంచి రూ.7 వేల మధ్య అడుగుతుండటంతో రైతులు వేచి ఉండేందుకు సుముఖత చూపుతున్నారు.

దిగుబడిపై సన్నగిల్లిన ఆశలు

ప్రస్తుతం కంది కోత, నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. పంట దిగుబడి 3 క్వింటాళ్ల వరకు వస్తుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు ఈ ఏడాది ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు సాగు చేశారు. కానీ రైతులు ఒకటి తలిస్తే ప్రకృతి, ప్రభుత్వం మరొకటి తలిచాయి. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కురిసిన వర్షాల తర్వాత కందికి మారుకామచ్చల పురుగు సోకడంతో ఎకరాకు క్వింటా వరకు దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.12 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు అటు దిగుబడి రాక, ఇటు ధర లేక సతమతమవుతున్నారు.

అమ్ముకోవడానికి నిబంధనలున్నాయ్

కందులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే రైతులు తప్పనిసరిగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తేమ శాతం 12, ఇతర వ్యర్థ పదార్థాలు 2 శాతం, కల్తీ గింజలు 3 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న, రంగుమారిన గింజలు 4 శాతం, ముతక, పూర్తిగా తయారు కాని గింజలు 3 శాతం, పురుగు పట్టిన గింజలు 4 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా పొదిలి మండలంలోని పాములపాడు, మల్లవరం, కొనకనమిట్ల మండలం మునగపాడు, పెదారికట్లలో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రకటించారు. కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టత రావాల్సి ఉంది.

పశ్చిమ ప్రకాశంలో కంది సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
మార్కాపురం	3,523
తర్లుపాడు	2,564
పొదిలి	23,931
కొనకనమిట్ల	8,648
గిద్దలూరు	3,358
బేస్తవారపేట	3,538
కంభం	410
అర్ధవీడు	662
కొమరోలు	1,574
రాచర్ల	2,016
యర్రగొండపాలెం	4,413
పుల్లలచెరువు	6,513
త్రిపురాంతకం	2,100
పెద్దారవీడు	2,663
దోర్నాల	664
మొత్తం	66,577

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రభుత్వం కంది పంట మద్దతు ధరను పెంచి కొనుగోలు కేంద్రాల ద్వారా నేరుగా కొనాలి. అప్పుడే కంది రైతులకు ఊరట దక్కుతుంది. లేదంటే దళారులు చెప్పిన ధరకు విక్రయించాల్సి వస్తుంది. ఫలితంగా రైతులంతా నష్టపోతారు.

– రామకృష్ణ, రైతు, గజ్జలకొండ



అమ్మనబ్రోలులో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

నాగులుప్పలపాడు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డూప్లికేట్ తాళంతో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు. ఈ ఘటన గురువారం సాయంత్రం నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులకు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబ్రోలు గ్రామంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన రావినూతల సురేష్ ఆటోడ్రైవర్‌గా, భార్య తిరుపతమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం సురేష్ ఆటో తీసుకుని ఒంగోలు వెళ్లగా, తిరుపతమ్మ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు డూప్లికేట్ తాళంతో ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్లారు. బీరువా తాళాలు కూడా తెరిచి అందులోని 30 గ్రాముల బంగారు చెయిన్, బుట్ట కమ్మలు, పలు వెండి వస్తువులతో పాటు రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు ముగించుకుని మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చిన తిరుపతమ్మ చోరీ జరిగినట్లు గుర్తించి భర్త సురేష్‌కు తెలిపింది. దీంతో స్థానిక పోలీసులకు సురేష్ ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలు సేకరించింది. చోరీకి పాల్పడింది స్థానికులేనని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

సింగరాయకొండ: దట్టమైన పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న గుర్తుతెలియని లారీని ప్రమాదవశాత్తూ ఓ ప్రైవేటు ట్రావెల్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దం ధ్వంసం కాగా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై సింగరాయకొండ మండల పరిధిలోని లారీ యూనియన్ ఆఫీసు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బెంగళూరు నుంచి రాజమండ్రి వెళ్తున్న షామోలీ ట్రావెల్స్ బస్సు లారీ యూనియన్ ఆఫీసు సమీపంలోకి రాగానే దట్టమైన పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ వెంకటేశ్వర్లు చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు ముందు వైపు ఉన్న అద్దం పూర్తిగా పగుళ్లివ్వడం మినహా ప్రయాణికులెవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. టంగుటూరు హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన ఇతర ట్రావెల్స్ బస్సులలో ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర వివరించారు.

ఈ బాధలు పడలేను.. నేను చనిపోతున్నా..!

- కొత్తపట్నం బీచ్‌లో మరణిస్తానంటూ తల్లిదండ్రులకు ఫోన్
- అనంతరం ఫోన్ స్విచాఫ్ చేసి దర్శికి చెందిన వివాహిత అదృశ్యం
- దర్శి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు
- భర్త, అత్తమామల వేధింపులే కారణమంటున్న తల్లిదండ్రులు


కనిపించకుండా పోయిన షాహిమ్ బేగం (ఫైల్)

దర్శి: దర్శికి చెందిన వివాహిత షేక్ షాహిమ్ బేగం హైదరాబాద్‌లో ఉన్న తల్లికి ఈ నెల 3వ తేదీ ఉదయం 11.40 గంటలకు ఫోన్ చేసింది. నేను మరణిస్తున్నాను.. ఈ బాధలు నేను పడలేను.. నాకు బతకాలని లేదు.. నా శవం కూడా మీకు కనిపించదు.. నేను కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి చనిపోతాను... అని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేసింది. దీంతో హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు షేక్ ఆదాం వలి, షేక్ జమీలా, సోదరుడు జిలానీ పాషా హుటాహుటిన దర్శి వచ్చారు. నేరుగా దర్శి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్శి, చుట్టుపక్కల తమకున్న బంధువులందరికీ తెలియజేసి తమ కుమార్తె ఆచూకీ కోసం గాలించారు. షాహిమ్ బేగం భర్త మస్తాన్ వలిని పోలీసులు ఆరాతీయగా.. తన భార్య బస్సు ఎక్కుతుండగా చూసి ఎక్కడికి వెళ్తున్నావని అడిగాననీ, అప్పుడు తామిద్దరి మధ్య ఘర్షణ కూడా జరిగిందని, ఆ సమయంలో షాహిమ్ బేగం ఆమె తల్లితో ఫోన్ మాట్లాడుతూ కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి చనిపోతున్నా అంటూ వెళ్లిపోయిందని చెప్పాడు. భార్య చనిపోతానని వెళ్తుంటే ఎందుకు ఆపలేదంటూ అతన్ని షాహిమ్ బేగం తల్లిదండ్రులు ప్రశ్నించారు. అందుకు అతను సమాధానం చెప్పలేదు. నాలుగు రోజులైనా తమ కుమార్తె ఆచూకీ లేదని, బతికి ఉంటుందన్న నమ్మకంతో హైదరాబాద్ నుంచి వచ్చి గాలిస్తున్నామని ఆమె తల్లిదండ్రులు వాపోతున్నారు.

14 సంవత్సరాల క్రితం వివాహం, ముగ్గురు పిల్లలు..

తాళ్లూరు మండలం రామభద్రాపురం గ్రామానికి చెందిన ఆదాం వలి హైదరాబాద్ వెళ్లి సెంట్రింగ్ పని చేస్తూ తన పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేశారు. రామభద్రాపురంలో ఉన్న సమయంలో దర్శిలో సమోసాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న మస్తాన్ వలికి కుమార్తె షాహిమ్ బేగంను ఇచ్చి 14 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కలిగారు. భర్త మస్తాన్‌వలి, అత్తమామలు తరచూ షాహిమ్ బేగంను వేధింపులకు గురిచేస్తూ ఉండేవారు. పిల్లల పోషణ సరిగా పట్టించుకునేవారు కాదు. దీంతో షాహిమ్ బేగం ప్రైవేట్ స్కూల్‌కి వెళ్లి చదువు చెబుతూ తన పిల్లలను కూడా చదివించుకుంటోంది. తనకు వచ్చిన డబ్బు కూడబెట్టి సొంతంగా నివాసం కూడా ఏర్పాటు చేసుకుంది. ఆ నివాసాన్ని భర్త వ్యాపారం పేరుతో బలవంతంగా తాకట్టు పెట్టించాడు. ఆమె వద్ద ఉన్న బంగారం కూడా తాకట్టు పెట్టి కనిగిరిలో క్యాంటీన్ తీసుకున్నాడు. ఆ బంగారాన్ని కూడా తన చెల్లి వద్ద మూడు లక్షలు అప్పు తీసుకుని ఆమె విడిపించుకుంది. ఆ తరువాత ఆమెను బలవంతంగా స్కూల్ మానిపించాడు. ఇంట్లో రకరకాలుగా అవమానిస్తూ టార్చర్ పెడుతుండటంతో ఆ బాధలన్నింటినీ తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పుకునేది. తల్లిదండ్రులు కూడా చేసేదేమీ లేక నచ్చజెబుతూ వస్తున్నారు. తమ కుమార్తెను ఇబ్బందిపెట్టవద్దని అల్లుడికి కూడా చెబుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ భర్తతో కొట్లాట జరిగి ఇంట్లో నుంచి షాహిమ్ బేగం వెళ్లిపోయింది. నాలుగు రోజులైనా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్శి పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్త, అత్తమామల వేధింపుల కారణంగా తమ కుమార్తె చనిపోతున్నా అని ఫోన్ చేసి అదృశ్యమైందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఎంతో ధైర్యం కలదని, మృతి చెందే అంత పిరికితనం లేదని చెబుతున్నారు. ఎక్కడైనా బతికే ఉంటుందని ఆశిస్తున్నారు. అత్తింటి వారి టార్చర్ భరించలేక పిల్లలను కూడా వదిలి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిని చూడాలని పిల్లలు ఏడుస్తున్నారంటూ కంటతడి పెట్టుకున్నారు. ఎవరైనా సమాచారం తెలిస్తే తెలియజేయాలని వేడుకుంటున్నారు.

మినీలారీని ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి


సంఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

పామూరు: ముందు వెళ్తున్న రిక్షాను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న మినీలారీని ఢీకొట్టి మోటర్‌సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని వగ్గంపల్లె గ్రామ సమీపంలో 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. పామూరు నుంచి వగ్గంపల్లె వైపు ఏపీ39ఎస్‌వై5028 నంబర్ గల బైక్‌పై సుమారు 22 ఏళ్ల వయసున్న యువకుడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని వగ్గంపల్లె వద్ద 565 జాతీయ రహదారిపై తాటాకులతో వెళ్తున్న రిక్షాను ఓవర్ టేక్ చేయబోయాడు. తాటాకులు తగిలి బైక్ అదుపు తప్పడంతో ఎదురుగా వస్తున్న మినీ లారీని ఢీకొట్టాడు. దీంతో ఆ యువకుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మతిచెందాడు. సంఘటనా స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ పి.దాసు పరిశీలించారు. మృతుడి వివరాలకోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం


మృతిచెందిన శ్రీను

చీమకుర్తి రూరల్: ఉరి వేసుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన చీమకుర్తి మండలంలోని ఏలూరువారిపాలెం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన గంగవరపు శ్రీను (33)కు చీరాలకు చెందిన నాగజ్యోతితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చాలాకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. గొడవ జరిగినప్పుడల్లా నాగజ్యోతి చీరాలలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తోంది. ఈ నేపథ్యంలో శ్రీను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై సీఐ ఎం.సుబ్బారావు దర్యాప్తు చేపట్టారు.

జల్సాల కోసం బైకుల చోరీ

- సింగరాయకొండ పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- ఆరు మోటారుసైకిళ్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

సింగరాయకొండ: జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు యువకులు దొంగల అవతారమెత్తారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలో పార్కింగ్ చేసిన మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. వరుసగా చోటుచేసుకుంటున్న బైక్ చోరీలపై దర్యాప్తు చేపట్టిన సింగరాయకొండ పోలీసులకు ×దొంగ× మిత్రులు చిక్కారు. నిందితుల వివరాలను సీఐ హజరత్తయ్య గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. మండల కేంద్రమైన సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గత కొద్దిరోజులుగా వరుసగా మోటారుసైకిళ్లు చోరీ అయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కందుకూరు పట్టణంలోని బండపాలేనికి చెందిన నీలిశెట్టి గురునాథం, యనమల దినేష్ ఒక బైకు చోరీ చేసి తీసుకెళ్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. బుధవారం సాయంత్రం సింగరాయకొండలోని కందుకూరు ఫ్లయ్ ఓవర్ వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించడంతో బైకుల చోరీ తీరును నిందితులు వివరించారు. సింగరాయకొండ బస్టాండ్‌లో 4, రైల్వే స్టేషన్‌లో ఒకటి, నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక మోటారుసైకిల్ చోరీ చేసినట్లు అంగీకరించారు. చోరీ చేసిన వాటిలో ఒక బైకును రూ.4 వేలకు విక్రయించి, మిగిలిన 5 బైకులను నిందితులు కందుకూరులోని తమ ఇంటి వద్ద భద్రపరిచారు. చోరీకి గురైన రూ.4 లక్షల విలువైన బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హజరత్తయ్య తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

చెడు సావాసంతోనే..

ఆరో తరగతితో చదువు ఆపేసిన గురునాథం ఆ తరువాత బేల్దారి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఒంగోలుకు చెందిన పాత నేరస్తులు శివ, శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో గురునాథం నేర ప్రవృత్తికి బానిసయ్యాడు. ఈ సమయంలో శివ, శ్రీకాంత్‌లను ఒంగోలు టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు. సులువుగా డబ్బు సంపాదించాలని భావించిన గురునాథం తన స్నేహితుడు దినేష్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చేసిన బైకులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డాడు. కాగా చోరీ కేసును ఛేదించేందుకు కృషి చేసిన ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, రైటర్ భాస్కరలింగం ఇతర సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించారని సీఐ తెలిపారు. సీసీ ఫుటేజ్ అందించి దర్యాప్తునకు సహకరించిన వ్యాపారులను సీఐ సత్కరించారు.

అప్పుల బాధతో మిర్చి రైతు ఆత్మహత్య


బాలకోటిరెడ్డి

తర్లుపాడు: ఆశించిన దిగుబడులు రాకపోగా.. మిర్చి ధరలు పడిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో మండలంలోని తాడివారిపల్లికి చెందిన రైతు మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు..తాడివారిపల్లికి చెందిన కలువ బాల కోటిరెడ్డి (43) స్వగ్రామం తాళ్లూరు మండలంలోని చింతలపాలెం. అతని ఇద్దరు కుమార్తెలను తాడివారిపల్లివాసులకు ఇచ్చి వివాహం చేశారు. బాలకోటిరెడ్డి దంపతులు కూడా ఇక్కడే ఉంటూ పొలం కౌలుకి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి, ఎకరంలో టమోట, ఎకరంలో వరి నాటాడు. మిర్చి, టమోట కోసం భారీగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో గత సోమవారం పలువురు మిర్చి రైతులను ధరలపై ఆరా తీశాడు. ధరలు పడిపోవడంతో మనస్తాపం చెందిన బాలకోటిరెడ్డి వెంటనే పొలానికి వెళ్లి మిర్చి కోసం తెచ్చుకున్న పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. కొద్ది సేపటి తరువాత పొలానికి వచ్చిన కోటిరెడ్డి భార్య ఆదిలక్ష్మి భర్త పురుగులమందు తాగినట్లు గుర్తించి బంధువుల సహాయంతో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు.